ప్రజల కోసమే పోలీసులు

సీఐని సన్మానిస్తున్న ధరణి రాజేశ్

ఉట్నూర్, మార్చి 9: పోలీసులు ఎల్లవేళలా ప్రజల కోసమే పని చేస్తారని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీలో గంజాయి సాగు లేకుండా చూస్తామన్నారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ నడుస్తుందన్నారు. కానుక ప్రజలు నేరుగా వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. అలాగే వ్యసనాలకు అలవాటు పడుతున్న యువతకు సన్మార్గంలో నడిపేందుకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. పట్టణంలో ర్యాస్ బైక్ రైడింగ్ సమస్య ఉన్నట్లు తెలిసిందన్నారు. త్వరలోనే వారిని పట్టుకుంటామని తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా ఉండేందుకు తాము 24 గంటలు పని చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

ఉట్నూర్ రూరల్, మార్చి 9: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ మొగిలిని శనివారం బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఆపద సమయంలో తమకు పోలీసులు అండగా ఉంటారని అన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు బాబాశ్యాం, నాయకులు విజయ్, అజయ్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉత్సవ సమితి సభ్యులు

కలెక్టర్‌కు మెమోంటో అందజేస్తున్న సమితి సభ్యులు

ఎదులాపురం,మార్చి 9 : ఇటీవల జిల్లా కలెక్టర్‌గా రాజర్షి షా బాధ్యతలు స్వీకరించారు. శనివారం కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి మెమోంటో అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు చేపడుతున్న కార్యక్రమాలను సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి కలెక్టర్‌కు వివరించారు. కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి మాధవ్, సభ్యులు ప్రపుల్‌వాఘే, రవీందర్, శశికళ చౌహాన్, సుభాష్, మహిపాల్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311806-All

★ఇంటర్, డిగ్రీ చదివి ఖాళీగా ఉన్న వారికి కంప్యూటర్ & ఇంగ్లీష్ కోర్సులు నేర్పి, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు చూపించబడును. 7997997364/5.
NT-327958-All

కోర్టు కేసులు

★మీరు మీ కోర్టు కేసులతో బాధ పడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? ఎంత క్లిష్టమైన కేసులైనా తక్కువ Feesతో నమ్మకమైన లాయర్‌తో Solve చేస్తాం. GLS, L.B.నగర్, Hyd. 7893011777.
NT-311861-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

ప్రైవేట్ పనుల్లో పంచాయతీ ట్రాక్టర్

పల్లె ప్రగతి ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న సెంట్రింగ్ కర్ర

బజార్‌హత్నూర్, మార్చి 9 : మండలంలోని పల్లె ప్రగతి ట్రాక్టర్లపై పంచాయతీ ప్రత్యేకాధికారుల నిఘా కరువై ప్రైవేట్ వ్యక్తుల ఇష్టానుసారంగా మారిందని మండల ప్రజలు వాపోతున్నారు. శనివారం మండలంలోని ఓ గ్రామ పంచాయతీకి చెందిన పల్లె ప్రగతి ట్రాక్టర్ ఉన్నతాధికారులకు తెలియకుండానే ప్రైవేట్ పనులకు వినియోగిస్తూ నమస్తే తెలంగాణ కెమెరాకు చిక్కింది. గతంలో పంచాయతీలో సర్పంచ్‌ల పదవీ కాలం ఉండడంతో తమ పరిధిలో ఉన్న ట్రాక్టర్లను రోజువారీగా పరిశీలించే వారు. కానీ వారి పదవీ కాలం ముగియడంతో అడిగే వారు లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాత్రశూన్యంతో ప్రైవేట్ వ్యక్తులు పంచాయతీ ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. పంచాయతీ పరిధిలోని ట్రాక్టర్ వేరే చోటుకు వెళ్తే ఉన్నతాధికారుల అనుమతులు తీసుకోవాలి కానీ అలాంటివి ఏమి లేవని ఎంపీవో అతుల్‌కుమార్ తెలిపారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు పంచాయతీ ట్రాక్టర్లపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీతో సమస్యలు పరిష్కారం కావు

ఎదులాపురం, మార్చి 9 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న రోజులు జిల్లా సమస్యలు పరిష్కారం కావని రైల్వే లైన్ సాధన కమిటీ చైర్మన్, కార్యదర్శులు సిర్ర దేవేందర్, నిమ్మల నరేందర్ అన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహం ముందు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం 54వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారం ఉన్న బీజేపీతో ఎలాంటి అభివృద్ధి పనులు కావడం లేదన్నారు. ఈ నెల 4వ తేదీన జిల్లాకు వచ్చిన మోదీ ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభించక పోవడమన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రిలే నిరాహార దీక్షలో సాధన కమిటీ సభ్యులు మెస్రం భాస్కర్, గాజంగుల రాజు, శంకర్, రాథోడ్, రవీందర్, సైఫ్‌ఖాన్, ఖాసీం, డేవిడ్ కూర్చున్నారు.

రిలే నిరాహారదీక్షలో కూర్చున్న సాధన కమిటీ సభ్యులు

13న ఉద్యోగ మేళా

ఉట్నూర్, మార్చి 9: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 13వ తేదీన ఉట్నూర్ యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)లో ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున 18 నుంచి 35 సంవత్సరాల యువత తమ బయోడేటా, విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. ఈ మేళాలో హైదరాబాద్‌కు చెందిన 15 ప్రముఖ కంపనీలు వస్తున్నాయని తెలిపారు.

తప్పిన ప్రైను ప్రమాదం

నార్నూర్, మార్చి 9 : చోర్‌గావ్ గ్రామంలోని శివుని మందిర సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ సర్క్యూట్‌కు శనివారం మంటలు వ్యాపించాయి. మంటలు చెలరేగే లోపు స్థానికులు అప్రమత్తమై హుటాహుటిన నీటితో మంటలు ఆర్పివేశారు. తక్షణమే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలివేశారు. చాలా పెద్ద ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.



జైనథ్: పెండల్‌వాడలో ఆత్మలింగ ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

ఇంద్రవెల్లి: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

పూజలు.. అన్నదానాలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 9: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శనివారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదిలాబాద్‌లోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నీలకంఠుడిని దర్శించుకొని ఉపవాస దీక్షలు విరమించారు. అనంతరం ఆలయాల్లో ఏర్పాటు చేసిన మహా ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

జైనథ్, మార్చి 9: మండలంలోని భోరజ్ భారీ శివలింగం, కోరటలోని ఓంకారేశ్వర ఆలయం, పెండల్‌వాడలోని ఆత్మలింగ ఆంజనేయస్వామి ఆలయం, కంఠలోని కోటి లింగాలు, లక్ష్మీపూర్‌లోని మార్కండేయ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి శివరాత్రి ఉపవాస దీక్షలు విరమించారు. మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కోరట, లక్ష్మీపూర్ గ్రామాల్లో శివ దీక్షాపరులు దీక్ష విరమణ చేశారు.

ఇంద్రవెల్లి, మార్చి 9: మండల కేంద్రంలో భక్తుల ఆధ్వర్యంలో పల్లకీతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు భజన పాటలు పాడుతూ దేవతల ప్రతిమలతో ఊరేగింపు నిర్వహించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు, మహిళలు పాటించిన శివరాత్రి ఉపవాస దీక్షలు విరమించారు.

నార్నూర్, మార్చి 9 : చొర్‌గావ్ శివాలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. నాగదేవత, శివుని దర్శనానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నలుమూల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మూర్తి రాములు మహారాజ్ ఆధ్వర్యంలో రాంసింగ్ మహారాజ్‌తో కలిసి శోభాయాత్ర నిర్వహించారు.



ఆదిలాబాద్‌రూరల్ : పూజలు చేస్తున్న భక్తులు

భక్తులు ఉపవాసలు విరమించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో జెండాను ఆవిష్కరించి, సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులను ఉద్దేశించి రాంసింగ్ మహారాజ్ హితబోధన చేశారు. ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, నార్నూర్ మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రమేశ్‌నాయక్, శేరు, అర్జున్, నర్సోడు, గ్రామపెద్దలు ,భక్తులు పాల్గొన్నారు.

బోథ్, మార్చి 9 : బోథ్‌లోని శివ భక్త మార్కండేయ ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ముగిశాయి. శుక్రవారం రాత్రి భక్తులు ఆలయంలో జాగారణ చేశారు. భక్తులు భజన సంకీర్తనలు ఆలపించారు. పరమ శివుడిని కొలుస్తూ పాటలు పాడారు. శనివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులంతా ఉపవాస దీక్షలు విరమించారు. ఆలయ కమిటీ సభ్యులు భజన పరులను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేముల చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి బైరి రవి, కోశాధికారి దీకొండ సత్యనారాయణ, పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు భోజన్న, అనిల్‌కుమార్, రవి, రవీందర్, రాజేశ్వర్, నర్సయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నవాగు తీర్థానికి భక్తుల తాకిడి

బోథ్, మార్చి 9 : కుచులాపూర్ గ్రామ సమీపంలోని వాగులో కొలువై ఉన్న సోమేశ్వరుని దర్శనానికి శనివారం భక్తుల తాకిడి కనిపించింది. చిన్నవాగు తీర్థంగా పిలువబడే ఈ పుణ్యక్షేత్రానికి చుట్టూ పక్కల గ్రామాల భక్తులు తరలి వచ్చారు. వాగులోని లింగానికి పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ సోమన్నను దర్శించుకొని పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



తాంసి: శివాలయంలో పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తాంసి(భీంపూర్), మార్చి 9: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామంలోని శివాలయంలో శనివారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పూజలు చేసి 501 కొబ్బరికాయలు సమర్పించారు. అందరికీ శివపార్వతులు శుభాలు చేకూర్చాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులతో కలిసి ఎమ్మెల్యే ఉత్సాహంగా ఆలయాల దర్శనాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, నాయకులు నరేందర్ యాదవ్, సంజీవ్ రెడ్డి, కల్చాప్ యాదవ్, నరేందర్ రెడ్డి, గంగయ్య, సుభాష్, కార్యకర్తలు ఉన్నారు.

విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు

పిప్పిరిలో పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

బజార్‌హత్నూర్, మార్చి 9: నామమాత్రంగా విధులకు హాజరవుతున్న పంచాయతీ కార్యదర్శులపై శాఖ పరమైన చర్యలు తప్పవని డీఎల్‌పీవో ఫనిందర్‌రావ్ హెచ్చరించారు. శనివారం మండలంలోని జాతర్ల, పిప్పిరి, గిర్నూర్, బజార్‌హత్నూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామ పంచాయతీల్లోని రికార్డులు పరిశీలించారు. పారిశుధ్యం, నీటి ఎద్దడిపై చేపడుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామ పంచాయతీలో విధులు నిర్వహించాల్సి ఉండగా కేవలం నామమాత్రంగా వెళ్లి తిరిగి ఇంటి ముఖం పడుతున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేపట్టడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరవుతున్నరా లేదా చూడాల్సిన బాధ్యత ఎంపీవోపై ఉందని మండిపడ్డారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా, పారిశుధ్య పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీవో అతుల్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఉదారికి.. పుస్తకం అంకితం

ఉదారి నారాయణకు పుస్తకం అంకితం ఇస్తున్న కవయిత్రి

తాంసి, మార్చి 9: బండల్‌నాగపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణకు అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ భాషా సాంస్కృతి శాఖ సౌజన్యంతో శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శ్రీమతి గడ్డం సులోచన రాసిన 'నానీ లోచనాలు' పుస్తకావిష్కరణ తర్వాత ఈ సంపుటి రచయిత్రి ఉదారికి అంకితం చేశారు. కాగా ఆదిలాబాద్ 'ఐత్వారం ముచ్చట' కవులు ప్రముఖ కవి గోపిని కలిశారు.

నార్నూర్: చొర్‌గావ్‌లో బైక్ ర్యాలీ తీస్తున్న భక్తులు

నార్నూర్: పూజలు చేస్తున్న రాంసింగ్ మహారాజ్, మూర్తి రాములు మహారాజ్

ఘనంగా పులాజీబాబా ధ్యాన మందిర వార్షికోత్సవం

వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాంసి(తలమడుగు), మార్చి 9 : తలమడుగు మండలం కుచులాపూర్ గ్రామంలో శనివారం పులాజీబాబా 28వ ధ్యాన మందిర వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరణ, ధ్యాన ఆరాధన చేశారు. ఈ సందర్భంగా పులాజీ బాబా సంస్థాన్ అధ్యక్షుడు పెట్కులే రవీందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాబా అడుగుజాడల్లో నడిచి ధ్యానాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బాబా భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఇచ్చోడ, మార్చి 9: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ నరేశ్ అన్నారు. శనివారం రాయిగూడ గ్రామంలోని ఏహెచ్ఎస్ పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న 12 మంది పిల్లలను ఉన్నత కేంద్రానికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టు అరుణ్, ఏఎన్ఎం రోజా, హెచ్ఎం విజయ్ ప్రకాశ్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నరేశ్

ముగ్గురి అరెస్ట్

తాంసి, మార్చి 9: మండల కేంద్రంలోని మాధవి వైన్స్‌లో దొంగతనానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ ఫణిందర్ తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న పోశెట్టి అనే వ్యక్తి గతంలోనూ పలు మార్లు మాధవి వైన్స్‌లో దొంగతనం చేశారు. నేరం జరిగిన సీసీ కెమెరాల ద్వారా నిందితులను త్వరగా గుర్తించవచ్చని వివరించారు. అక్రమ దందాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తలమడుగు ఎస్ఐ ధనశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రూరల్ సీఐ ఫణిందర్

11న జడ్పీలో సమీక్షా సమావేశం

ఎదులాపురం,మార్చి 9 : రానున్న రంజాన్ పండుగను పురస్కరించుకొని జడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 11వ తేదీన సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయే ఈ సమావేశంలో రంజాన్ ఏర్పాట్లపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులు ముస్లిం మత పెద్దలు హాజరుకావాలని సూచించారు.